క్లుప్తంగా

రైతుల అభ్యున్నతే లక్ష్యం



సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి

పెనుకొండ: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తానని పెనుకొండలోని ఇస్లాపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఎన్నికైన గొల్లపల్లి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ తనకు దక్కిన ఈ పదవిని సద్వినియోగం చేసుకుని రైతులకు న్యాయం చేస్తానన్నారు. శనివారం జరిగే తన ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే శంకరనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



శశికుమార్(ఫైల్)

గుడిబండ: తన కుమారుడు శశికుమార్ కనిపించడం లేదని మండల పరిధిలోని ఫళారం గ్రామానికి చెందిన చంద్రప్ప గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం నిమిత్తం అంటూ గతనెల 15న ఇంటినుంచి వెళ్లిన శశికుమార్ ఆ తర్వాత తిరిగి రాలేదని, పలు ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియలేదని తండ్రి ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తోందని పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుడిబండ: ముతుకూరు–2 గ్రామ పంచాయతీలోని కె.కె.పాళ్యం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ జగదాంబ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, హౌసింగ్ ఏఈ

పరిగి: మండలంలోని మోదా జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, హౌసింగ్ ఏఈ సునిత గురువారం పరిశీలించారు. ఇప్పటి వరకూ 73 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని తహసీల్దారు తెలిపారు. త్వరగా నిర్మాణాలను పూర్తీ చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఎంపీటీసీ అంజినప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్, మంజు, రామాంజి, సెక్రెటరీ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



ప్రత్యేక అలంకరణలో పీర్లస్వాములు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో నగర గుడి పీర్ల స్వామి గుడిలో మొహర్రం వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పీర్ల స్వాములకు చక్కెర, పానకం చదివించారు. గుడి ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కొంత మంది భక్తులు నిప్పులు తొక్కి మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని మరో రెండు పీర్లస్వామి ఆలయాల్లో జలధి ఉత్సవాలు జరిగాయి. నగ గుడి పీర్ల స్వామి జలధి ఉత్సవాలు శుక్రవారం జరుగుతాయని ముజావర్లు తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన



ఎస్ డబ్ల్యూ పీసీ సెంటర్లను తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం అధికారులు

అగళి: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అంశంపై మండల పరిధిలోని అగళి, ఆలుడి, మాదుడి, నరసంబుది గ్రామ పంచాయతీలలో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. ఎస్ డబ్ల్యూ పీసీ సెంటర్లను, అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఈఓఆర్‌డీ పద్మావతి పాల్గొన్నారు.

మడకశిర ఎన్నికల ఆర్‌ఓగా చిన్నయ్య

మడకశిర: మడకశిర నియోజకవర్గం ఎన్నికల ఆర్‌ఓగా అహుడా కార్యదర్శి చిన్నయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో చిన్నయ్యను ఆర్‌ఓగా నియమించినట్లు తెలిపారు. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. ఓటర్ల నమోదు, తొలగింపు తదితర అంశాలపై సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



హిందూపురం: పథకాలను వివరిస్తున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

- ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, హిందూపురం సమన్వయకర్త దీపిక

రొద్దం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకూ అండగా ఉందని, ఈ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆదరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని తురకాలపట్నం, పెద్దిపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపుతున్నాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా సచివాలయ సిబ్బందిని సంప్రదిస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ పరమేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, కలిపి పీఏసీఎస్ చైర్మన్ కేపీ శ్రీనివాసులు, ఎంపీటీసీలు మాధవిశ్రీనివాస్, శంకర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజారెడ్డి, ఉప సర్పంచ్ ధనుంజయ, ముఖ్య నాయకులు ఎన్. నారాయణరెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, సచివాలయ అధికారులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నను ఆశీర్వదించండి

గుడిబండ: వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివర్గాలకూ మంచి జరుగుతోందని, మరోమారు సీఎం జగనన్నను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామ సచివాలయ పరిధిలోని ఇటికేపల్లి, తండా గ్రామాల్లో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం జగనన్న పాలనలో తమకు ఎంతో మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు సక్రమంగా ఇంటి వద్దకే అందుతాయన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబు నాయుడు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ పాలనలో వలంటీర్ల, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించి సీఎంగా ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచ్ జగదాంబ, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యురాలు సుశీల, మండల బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, నాయకులు కృష్ణప్ప, నాగేష్, శివరాజు, గోపాలరావు, శ్రీధర్‌స్వామి, కాంతరాజు, జయరామ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే జగనన్న ధ్యేయం

- నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం అర్బన్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా శ్రమిస్తున్న సీఎం జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీకి ప్రజలు మరోమారు పట్టం కట్టడం తథ్యమని ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పేర్కొన్నారు. హిందూపురం గ్రామీణ మండలం కొటిపి గ్రామంలో గురువారం చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, జబీవుల్లా, సర్పంచ్ ఆదెప్ప, నాయకులు హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డి, బసిరెడ్డి, మారుతీరెడ్డి, సాధిక్, నాగమణి, తిప్పేరుద్రయ్య, ఆనంద్, ఎంపీడీఓ నరేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరస్పరం ఢీకొన్న వాహనాలు

- వివాహిత దుర్మరణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం



కారులో రాధమ్మ మృతదేహం

అగళి: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె భర్త కూడా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా రొప్పం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప (45), రాధమ్మ (38) దంపతులు. రొళ్ల మండలం రత్నగిరిలోని తన పుట్టినింటికి భర్తతో కలసి రాధమ్మ వచ్చింది. గురువారం సాయంత్రం తన సోదరుడు మంజునాథ్‌తో కలసి స్వగ్రామానికి కారులో బయలుదేరింది. అగళి మండలం పి.బ్యాడిగెర వద్దకు చేరుకోగానే ఎదురుగా హిందూపురానికి వేగంగా వెళుతున్న టాటాఏస్ వాహనం ఢీకొంది. ఘటనలో కారులోనే చిక్కుకుని రాధమ్మ మృతి చెందింది. మంజునాథ్, హనుమంతరాయప్పతో పాటు ప్రమాదానికి కారణమైన టాటాఏస్ వాహన డ్రైవర్ ఖలీమ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే శిర పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక హనుమంతరాయప్ప మృతిచెందాడు. మంజునాథ్, ఖలీమ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అగళి ఎస్‌ఐ లావణ్య అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.



ఆస్పత్రికి తరలించక ముందు ఘటన స్థలంలో హనుమంతరాయప్ప

'జగనన్న సురక్ష' రాష్ట్ర చరిత్రలో నూతన ఒరవడి

- 95 శాతం సమస్యలు పరిష్కారం
- నియోజకవర్గ సమన్వయకర్త దీపిక



మాట్లాడుతున్న హిందూపురం సమన్వయకర్త టిఎన్.దీపిక

హిందూపురం: ఏ సమస్యనైనా క్షణాల్లో పరిష్కరించేందుకు అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర చరిత్రలోనే నూతన ఒరవడి సృష్టించిందని హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. గురువారం స్థానిక బైపాస్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు జగనన్న సురక్ష ద్వారా పరిష్కారం అయ్యాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వార్డులు, గ్రామపంచాయతీల్లో ప్రజలనుంచి 67వేల పైచిలుకు అర్జీలు స్వీకరించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. 95శాతం సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సీఎం జగనన్న పెద్ద పీట వేశారన్నారు. ఇలాంటి పాలన దీర్ఘకాలం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఇలా ఎలాంటి సమస్యనైనా పరిష్కరించేందుకు తాను కృషి చేస్తున్నట్లు దీపిక తెలిపారు. 2024 ఎన్నికల్లో జగనన్నకు దీవెనలు అందించాలన్నారు. ప్రజల ఆశీస్సులతో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో ఎవరి దౌర్జన్యాలు సహించబోమన్నారు. ప్రజలకు న్యాయం, సంక్షేమం అందించడమే తమ లక్ష్యమన్నారు. కొందరు స్థలాలు ఆక్రమించారని, దౌర్జన్యాలు చేస్తున్నారని తమ దృష్టికి తెచ్చారని, ఆ సమస్యలను జిల్లా కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణాజలాలు తెచ్చింది జగనన్న ప్రభుత్వమే

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరకు కృష్ణాజలాలు తెచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే తిప్పేస్వామి స్పష్టం చేశారు. తామే మడకశిరకు కృష్ణాజలాలు తీసుకొచ్చామని టీడీపీ నేతలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన గురువారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి కృష్ణాజలాలు తీసుకురావడంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణాజలాలు తెప్పించి నియోజకవర్గంలో చెరువులు నింపి మరువలు పారించామన్నారు. గుడిబండ, అమరాపురం మండలాలకు సాగు నీరు అందించడానికి కాలువలు సిద్ధం చేశామని తెలిపారు. అయితే ఎగువ ప్రాంతంలో కాలువలు సిద్ధం కాకపోవడంతో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. అన్ని మండలాలకు కృష్ణాజలాలు అందించడానికి బైపాస్ కెనాల్‌ను కూడా మంజూరు చేయించామని తెలిపారు.

53,098 మందికి 11 రకాల సర్టిఫికెట్లు అందేత

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో 70,486 మంది వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఇందులో 53,098 మందికి సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 86,926 కుటుంబాలు ఉండగా ఈ కార్యక్రమం ద్వారా 72,832 కుటుంబాలను సచివాలయాల సిబ్బంది సందర్శించినట్లు తెలిపారు. పేదలకు ఈకార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి , ఎంపీపీ కవిత, డైరెక్టర్ నాగరాజు, జేసీఎస్ కన్వీనర్లు శివన్న, నాగేంద్రయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ మూర్తి, నాయకులు జయరాజ్, మంజునాథ్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సంస్కరణలపై నేడు సదస్సు



రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేనికి స్వాగతం పలుకుతున్న అధికారులు

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు గురువారం రాత్రి పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. శాంతిభవన్ అతిథి గృహం వద్ద జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి వేలాయుధం, ఏడీఈ వై.ఫక్రుద్దీన్, టీఎస్ షబ్బీర్ అహమ్మద్ తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందన సమావేశపు హాల్‌లో వ్యవసాయ రంగం–సంస్కరణలపై జరిగే సదస్సులో కొమ్మినేని శ్రీనివాస రావు పాల్గొంటారు.

మద్యం మానేస్తే ప్రశాంత జీవనం

పావగడ: మద్యం మానుకుంటే జీవితాలు సంతోషంగా ఉంటాయని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప అన్నారు. తాలూకాలోని లింగదహళ్లి గ్రామంలో శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మద్యపాన విసర్జన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరాలతో వేలాది మంది మద్య పాన ప్రియులు మద్యాన్ని వదిలి కుటుంబ సభ్యులతో సుఖంగా ఆరోగ్య వంతమైన జీవితాలను సాగిస్తున్నారని కొనియాడారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం

హిందూపురం: పట్టణంలో కొత్తగా నిర్మాణమైన కమర్షియల్ మార్కెట్‌లో సమస్యలు పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పూల వ్యాపారులు, కమర్షియల్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌లో సరైన లైటింగ్ కల్పించాలని, మార్కెట్ చుట్టూ తోపుడు బండ్లు నిలపకుండా చూడాలని, మార్కెట్ గేట్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి తరలించాలని, మార్కెట్‌లో రోజూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వ్యాపారులు కమిషనర్‌ను కోరారు. 8వతేదీ లోపు సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమ్మకాయల రాము, నాగిరెడ్డి, వినయ్, పూలమార్కెట్ అధ్యక్షులు హిదయతుల్లా, అంజినప్ప పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు 5న ఇంటర్వ్యూ

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) మహిళ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఈనెల 5న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మురళీ మోహన్ గురువారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు.

కాలం చెల్లిన తినుబండారాల విక్రయం



గోడౌన్‌లో లభ్యమైన కాలం చెల్లిన తినుబండారాలు



తినుబండారాలను పరిశీలిస్తున్న ఆహార భద్రతా అధికారిణి తస్లీమ్

హిందూపురం టౌన్: చిప్స్, బిస్కెట్స్ లాంటివి చిన్నారులు ఇష్టంగా తింటారు. తల్లిదండ్రులు చేతికి డబ్బు ఇవ్వగానే తుర్రుమని దుకాణానికి వెళ్లి వాటిని కొంటుంటారు. వాటి తయారీ తేదీ ఏమిటి అనేది పరిశీలించే ఆసక్తి పిల్లలకు ఉండదు. చేతికందగానే తింటుంటారు. ఇదే అదునుగా దుకాణదారులు కాలం చెల్లిన తినుబండారాలు వారి చేతిలో పెట్టి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ దందాకు హిందూపురం కేంద్రంగా మారింది. కాలం చెల్లిన ప్రముఖ కంపెనీలకు చెందిన చిప్స్, బిస్కెట్స్ ప్యాకెట్లపై మ్యానిఫ్యాక్చరింగ్ వివరాలను తొలగించి కొత్త తేదీలను ముద్రించి విక్రయించేస్తున్నారు.

బెంగళూరు నుంచి రవాణా

పట్టణానికి చెందిన వేమనాథ్ అనే వ్యక్తి పట్టణంలోని శ్రీకంఠపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గోడౌన్‌గా మార్చి ఈ దందాను కొనసాగిస్తున్నాడు. బెంగళూరు నుంచి కాలం చెల్లిన తినుబండారాలను తీసుకువచ్చి ప్యాకెట్లపై తేదీలను చెరిపేస్తూ.. కొత్త తేదీలను ముద్రిస్తున్నాడు. వీటిని హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు గోరంట్ల, సోమందేపల్లి, కర్ణాటకలోని పావగడలో విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ దందా వ్యవహారం స్థానికుల ద్వారా వెలుగు చూడటంతో ఆహార భద్రతా అధికారిణి తస్లీమ్ వెళ్లి పరిశీలించారు. రూ.45వేల విలువైన వివిధ కంపెనీలకు చెందిన బిస్కెట్స్, చిప్స్ సరుకును గోడౌన్‌తో సహా సీజ్ చేశారు. ఈ వ్యవహారం నడుపుతున్న వేమనాథ్ అనే వ్యక్తిపై 2006 ఆహార భద్రత చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. తినుబండారాలు ఎక్కడెక్కడ విక్రయించారనే విషయంపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదం... ఇద్దరికి గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేంద్రప్ప, నాగప్ప అనే వ్యక్తులు గాయపడ్డారు. మద్దనకుంట గ్రామానికి చెందిన నాగప్ప టీవీఎస్ మోపెడ్‌లో వస్తుండగా దేవగానపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రప్ప బైక్‌లో వస్తూ టీవీఎస్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. గాయపడిన నాగేంద్రప్పను శిర ఆసుపత్రికి, నాగప్పను అమరాపురం మడకశిర ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెనుకొండ మండలం కొండాపురం గ్రామానికి చెందిన వడ్డే హరీష్ (30) హిందూపురం మండలం అప్పలకుంటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో గురువారం అతిగా మద్యం సేవించి మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మసీదుకు స్థలం కేటాయింపు

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి గ్రామంలో మసీదు నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు 3 సెంట్ల స్థలం కేటాయించగా గురువారం ముస్లిం మైనార్టీలకు జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి పంపిణీ చేశారు. అదేవిధంగా ఎంపీపీ వెంకటరత్నమ్మ చొరవతో విభూతిపల్లి నుంచి పులమతికి రోడ్డుకు గ్రావెల్ వేసి చదును చేయించారు.

ఓటరు సర్వే వేగవంతం చేయండి

రొళ్ల: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటా సర్వేను బీఎల్‌ఓలు వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటా సర్వేపై వీఆర్వోలతో ఆరా తీశారు.

పెనుకొండ: ఓటరు సర్వేలో భాగంగా తహసీల్దార్ స్వర్ణలత గురువారం పట్టణంలోని అర్బన్ కాలనీలోని బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడారు.

తల్లిపాలే శ్రీరామ రక్ష

మడకశిరరూరల్ : బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, సర్పంచ్ ప్రభావతిబాయి సూచించారు. గురువారం చందకచెర్లు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. మాజీ ఎంపీపీ బజ్జప్ప పాల్గొన్నారు. మెళవాయి పంచాయతీలోని యూ రంగాపురం, గుడ్డంపల్లి, జక్కేపల్లి, సింగేపల్లి, మెళవాయి, పాపసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ రంగనాథ్, ఎంపీటీసీ గంగరత్నమ్మ పాల్గొన్నారు.

అమరాపురం: బసవనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజశ్వేరి, సర్పంచ్ నరసింహప్పలు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

అక్రమ కంచెను తొలగించండి

చిలమత్తూరు: మొరసలపల్లి పంచాయతీలో బెంగళూరుకు చెందిన రెడ్డెప్పశెట్టి అనే వ్యక్తి తమ గ్రామాలకు, పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా కంచె వేసుకున్నాడని, దానిని తొలగించాలని మొరసలపల్లి, మొరసలవాండ్లపల్లి, కందుర్పర్తి, పాలేపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

చైన్‌స్నాచర్ల హల్‌చల్

హిందూపురం అర్బన్: పట్టణంలో దుండగులు చైన్ స్నాచింగ్‌కు యత్నించారు. డీబీ కాలనీకి చెందిన విజయ అనే మహిళ ఇద్దరు స్నేహితులతో కలిసి స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఉన్న వీధిలో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో వాకింగ్ చేస్తోంది. ఆ సమయంలో బైక్‌లో వచ్చిన మాస్కులు ధరించిన ముగ్గురు దొంగలు విజయ అనే మహిళ నుంచి గొలుసు ఉందని భావించి చున్నీ లాగారు. అయితే ఆమె మెడలో గొలుసు లేదు. కాగా బాధితురాలు అప్రమత్తమై కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. విజయ భర్త శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు వచ్చి ఆప్రాంతంలో సీసీ కెమెరాలు పరిశీలించి దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

బీజేపీ యువనేత బలవన్మరణం

సోమందేపల్లి: ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపులు తాళలేక బీజేపీ యువనేత ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. సోమందేపల్లి మండలం రూకలపల్లికి చెందిన శ్రీనివాసులు (32), నందిని దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నా రు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే శ్రీనివాసులు బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తూ యువనేతగా గుర్తింపు పొందాడు. పార్టీ కార్యక్రమాలకు, ఇతర అవసరాలకు రూ.10 లక్షల వరకూ అప్పు లు చేశాడు. ఈ క్రమంలో కంతులు సక్రమంగా చెల్లించకపోవడంతో హిందూపురంలోని ఓ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వారం రోజుల క్రితం శ్రీనివాసులు ఇంటి వద్దకెళ్లి గొడవ చేశారు. అప్పటి నుంచి తన పరువు పోయిందంటూ ఆవేదనతో కుంగిపోయిన ఆయన బుధవారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ మురళి తెలిపారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



నరసప్పకు పింఛన్ మొత్తం అందిస్తున్న వలంటీర్ నరేష్

పరిగి: లబ్ధిదారుడు ఎక్కడ ఉన్నా సకాలంలో పింఛన్ అందజేయాలనే వలంటీర్ సేవలను ప్రతి ఒక్కరూ కొనియాడుతున్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో వలంటీర్ నరేష్ బెంగళూరుకు వెళ్లి లబ్ధిదారుడకు పింఛన్ అందజేశారు. గ్రామానికి చెందిన వీ నరసప్ప అనే వ్యక్తి బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని అక్కడే కుమారుడు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్‌ను అందజేయాలనే ఉద్దేశంతో వలంటీర్ నరేష్ నరసప్ప ఇంటికి వెళ్లగా అతను బెంగళూరులో ఉన్నట్లు తెలిసింది. దీంతో సొంత ఖర్చులు పెట్టుకుని గురువారం బెంగళూరుకు వెళ్లి నరసప్పకు వృద్ధాప్య పింఛన్ మొత్తం అందజేసి బయోమెట్రిక్ వేయించుకున్నాడు. వలంటీర్ ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి బెంగళూరుకు వచ్చి పింఛన్ అందజేయడంతో నరసప్ప కృతజ్ఞతలు తెలిపారు.